ఒలింపిక్స్‌లో భారత్‌కు పతకం రావడంతో హాకీ క్రీడాకారులు సంబరాలు

విశాలాంధ్ర - నక్కపల్లి : పారిస్ ఒలింపిక్స్‌లో జరిగిన హాకీ టోర్నమెంట్ లో భారత్ హాకీ జట్టు స్పెయిన్ పైన 2-1 తేడాతో విజయం సాధించి కాంస్య పతకం సాధించిన సందర్భంగా మండల కేంద్రం బియస్ హాకీ క్రీడాకారులు జై భారత్ జైజై భారత్ అంటూ అభినందనలు తెలియజేస్తూ ర్యాలీ నిర్వహించారు. సంబరాలు చేసుకున్నారు..అనంతరం కేక్ కట్ చేసి క్రీడాకారులు స్వీట్స్ పంచారు. ఈ సందర్భంగా ఫౌండర్ బలిరెడ్డి సూరిబాబు, అధ్యక్షులు చిన్న అప్పారావు, కార్యదర్శి కొల్నాటి తాతాజీ, కోచ్ రాంబాబు, సీనియర్ జాతీయ క్రీడాకారుడు గాజుల రామచంద్ర రావు. రజిత్, నానాజీ తదితరులు టీం ఇండియాకు అభినందనలు తెలిపారు.

మతిభ్రమించి మాట్లాడుతున్న జగన్, సాయి రెడ్డి : బుద్ధ నాగ జగదీష్

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి : ఏ 1 జగన్ రెడ్డి, ఏ 2 విజయసాయిరెడ్డి వీరిద్దరూ ఎక్కడికి వెళ్ళినా రాష్ట్రంలో శాంతి భద్రతలు లేవని అదే పనిగా అబద్ధ ప్రచారాలతో 2019కి ముందు చెప్పిన విధంగా ఇప్పుడు చెప్తే ప్రజలు నమ్ముతారని మతిభ్రమించి మాట్లాడుతున్నారని మాజీ శాసనమండలి సభ్యులు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బుద్ధ నాగ జగదీశ్వరరావు ఘాటుగా విమర్శించారు. జగన్ రెడ్డికి పదవి పోవడంతో మనశ్శాంతి లేకుండా ఉన్నాడని, పిచ్చి పిచ్చిగా మాట్లాడుతున్నారని రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ లేదని, హత్యలు జరిగిపోతున్నాయని గగ్గోలు పెట్టడం నిత్యం ఎక్కడికి వెళ్లినా అదే పనిగా మాట్లాడుతున్నారని, నిన్న విజయసాయిరెడ్డి రాజ్యసభలో మాట్లాడుతూ. రాష్ట్రంలో శాంతి భద్రతలు లేవని రాష్ట్రపతి పాలన విధించాలని, అలాగే తెలంగాణ రాష్ట్రం నుండి విద్యుత్ బకాయిలు 7500 కోట్లు వసూలు చేయలేకపోతున్నారని మాట్లాడ్డం చూస్తుంటే దెయ్యాలు వేదాలు వల్లించిన రీతిలో ఉందని 2019 నుండి 24 వరకు రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వమే ఉందని కెసిఆర్ దగ్గర నుండి ఒక్క రూపాయి వసూలు చేయలేని దద్దమ్మలు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చంద్రబాబు నాయుడు స్నేహితులని అందుకే విద్యుత్ బకాయిలు వసూలు చేయలేకపోతున్నారని విజయసాయిరెడ్డి రాజ్యసభలో మాట్లాడిన విషయాన్ని ఏ ఒక్క పేపరు కూడా ప్రచురించలేదని దీన్ని బట్టి చూస్తే వాళ్ళ దీన పరిస్థితి కనబడుతుందని నాగ జగదీష్ ఎద్దేవా చేశారు. ఇక వినుకొండలో జరిగిన హత్య చేయబడిన నిందితుడు వైసిపి కార్యకర్తని ఇతనిపై ఆరు హత్య కేసులో ఉన్నాయని అటువంటి కార్యకర్త చనిపోయాడని పరామర్శించడానికి వెళ్లి సంక్షేమ పథకాల గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందని నాగ జగదీష్ జగన్ రెడ్డి పై మండిపడ్డారు. జగన్ రెడ్డి సాయి రెడ్డి పేటీఎం బ్యాచిలు ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదని సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం చేయడం చూస్తుంటే ప్రజలను పక్క త్రోవ పెట్టించడానికి నవరత్నాలు అమల్లో వైసిపి ప్రభుత్వం 2019లో అధికారంలోకి వస్తే 2020 జూలై తర్వాత అమలు చేశారని ఈ విషయాలు మరిచి పోయి ఓడించారని కక్షతో నానా రకాలుగా యాగి చేస్తున్నరని, కూటమి ప్రభుత్వం అధికారులకు వచ్చిన 60 రోజుల్లో అనేకమైన నిర్ణయాలు తీసుకున్నదని ఇచ్చిన హామీలు ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నారని ప్రజల్లో ఆనందం వ్యక్తం అవుతుందని, జగన్ రెడ్డి ఇప్పటికే ప్రజల్లో వ్యతిరేకతో వచ్చిందని చెప్పడం చూస్తుంటే గురివింద గింజ సామెత జ్ఞాపకం వస్తుందని, తన పరిపాలన కాలం ఐదు సంవత్సరాలు అరాచకం, భూ అక్రమంలు, ఇసుక దోపిడీ, సహజ వనరులు దోచుకోవడం, ప్రత్యర్థ పార్టీలపై అక్రమ కేసులు బనాయించడం, ప్రజాధనాన్ని ఎన్ని రకాలుగా దోచుకోవాలో అన్ని రకాలుగా దోచేశారని, ఖజానాలో చిల్లి గవ్వ లేకుండా చేశారని ఇంకా సిగ్గు లేకుండా తనకి ప్రత్యేక బందోబస్తు కావాలని, ప్రతిపక్ష హెూదా కావాలని కోర్టులు చుట్టూ తిరుగుతున్నారని ఇంతకుమించి ప్రజా సమస్యలపై ఏ ఒక్కరోజు ఈ 60 రోజుల్లో మాట్లాడలేదని వీరికి ప్రజలపై చిత్తశుద్ధి లేదని ఇటువంటి వారు భవిష్యత్తులో కూడా ప్రజలు అవకాశం ఇవ్వరని ఇక వైసీపీ బంగాళాఖాతంలో కలిసిపోవడం ఖాయమని నాగ జగదీష్ జోష్యం చెప్పారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

విశాలాంధ్ర - కే.కోటపాడు : మండలంలోని ఏ కోడూరు శివారు జంగం బంద చెరువులో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లు ఏ కోడూరు ఎస్సై జె రమేష్ తెలిపారు. 35 నుండి 40 సంవత్సరాల మధ్యలో ఉన్న యువకుని శరీరం పూర్తిగా ఉబ్బి పోయి గుర్తు పట్టని విధంగా ఉందన్నారు. తెలుపు నలుపు రంగుల అడ్డగీతలతో ఉన్న టీ షర్టు, జీన్ ప్యాంటు వేసుకున్నాడని, మృత దేహం ఆచూకీపై సంబంధిత వ్యక్తులు ఏ కోడూరు పోలీస్ స్టేషన్ ను సంప్రదించాలని ఆయన కోరారు.

ప్రేమ సమాజంలో విద్యార్థులకు నోట్ పుస్తకాలు, వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

విశాలాంధ్ర - చోడవరం : చోడవరం ప్రేమ సమాజంలో అంబేద్కర్ ట్రస్టు ఆధ్వర్యంలో విద్యార్థులకు పుస్తకాలు, వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ఛైర్మన్, సివిల్ జడ్జి నడుపూరు సన్యాసిరావు మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రంగాల్లో ముందుండాలని అన్నారు. నేటి యువతే దేశ భవిష్యత్తుకు పునాది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో విశాఖ అంబేద్కర్ భవన్ ఛైర్మన్ బొడ్డు కళ్యాణ్ రామ్, అంబేద్కర్ ట్రస్ట్ కార్య నిర్వాహకులు కండెల్లి వెంకటరావు, భూపతి రాజు, ప్రేమ సమాజం కార్యదర్శి రాజు, వృద్ధులు విద్యార్థినులు కార్య క్రమంలో పాల్గొన్నారు.

ఏఐటీయూసీ జాతీయ సమావేశాలు జయప్రదం చేయండి

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి : ఎఐటియుసి జాతీయ సమితి సమావేశాలు జయప్రదం చేయాలని ఏఐటియుసి రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులు బుసి వెంకటరావు, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పెంటకోట సత్యనారాయణ, రాజాన దొరబాబు పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలో గల పార్టీ కార్యాలయంలో జాతీయ సమావేశాల పోస్టర్ ను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ సమావేశాలు విశాఖ పట్నం స్టీల్ ప్లాంట్ గురజాడ కళాక్షేత్రంలో సెప్టెంబర్ 1,2,3 తేదీల్లో జరుగుతున్నాయని తెలిపారు. సమావేశంలో స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆలోచన నిర్మించుకోవాలని, నాలుగు లేబర్ కోడ్స్ ను రద్దు చేయాలని, కాంట్రాక్ట్ వ్యవస్థను రద్దుచేసి, కనీస వేత ఇరవై వేల రూపాయలు ఇవ్వాలని, అసంఘటిత కార్మికులకు పిఎఫ్,ఈఎస్ఐ తో కూడిన సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని చర్చించి కార్యాచరణ రూపొందిస్తారని తెలిపారు. సమావేశాలు చివరి 3 వ తేదీన విశాఖ నగరంలో భారీ ఎత్తున మహా ప్రదర్శన, బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు . కావున కార్మికులు ,ఉద్యోగులు కర్షకులు, హాజరై ఈ ప్రదర్శన బహిరంగ సభ విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వై ఎస్ భద్రం, ఎం అప్పలరాజు, కే త్రినాథ్, అర్ అప్పలరాజు, వీరాచారి ,పోతురాజు, నరాలశెట్టి సత్యనారాయణ, రమణ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీలకు భారీగా పెంచిన పంద్రాగస్టు నిర్వహణ ఖర్చు

విశాలాంధ్ర - కే.కోటపాడు : పంచాయతీల్లో స్వాతంత్ర్య దిన వేడుకల నిర్వహణ ఖర్చును ప్రభుత్వం భారీగా పెంచిందని , పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు పంచాయతీల ద్వారా చక్కని బహుమతుల అందించవచ్చునని ఉమ్మడి విశాఖ జిల్లా పంచాయతీ చాంబర్ అధ్యక్షులు దాడి ఎరుకు నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఉప ముఖ్యమంత్రి పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ కు కృతజ్ఞతలు తెలియజేశారు. గత 34 ఏళ్లుగా మేజర్ పంచాయతీలకు ఇప్పటివరకు కేవలం 250 రూపాయలు , మైనర్ పంచాయతీలకు వంద రూపాయలు నిర్వహణ ఖర్చు ఉండేది అన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం 100% పెంచుతూ 250 రూపాయలను 25 వేలు , వంద రూపాయలను పది వేలు కు పెంచారని అన్నారు. ఇటీవల పవన్ కళ్యాణ్ ను సర్పంచులు కలిసిన సందర్భంలో నిధులు కొరత వల్ల స్వాతంత్రదిన వేడుకలు, గణతంత్ర దినోత్సవ వేడుకలు చేయడం కష్టంగా ఉందని చెప్పిన మేరకు నిధుల పెంపు నిర్ణయం తీసుకోవడం ఆనందంగా ఉందని అన్నారు. పాఠశాలల్లో విద్యార్థులకు వ్యాసరచన , ఇతర క్రీడా పోటీలను నిర్వహించి బహుమతులు అందజేయడం , పారిశుధ్య కార్మికులను సత్కరించేందుకు ఈ నిధులను ఖర్చు చేస్తామని దాడి ఎరుకు నాయుడు స్పష్టం చేశారు.

రైతుల వివరాలు సొసైటీలో నమోదు చేసుకోవాలి

విశాలాంధ్ర - కశింకోట : మండలంలోని నరసింగబిల్లి ప్రాథమిక వ్యవసాయం సహకార సంఘం (పీ.ఏ.సీ. ఎస్) సభ్యులంతా కంప్యూటరీకరణలో బాగంగా వివరాలు నమోదు చేయాలని నరసింగబిల్లి ప్రాథమిక వ్యవసాయం సహకార సంఘం పర్సన్ ఇన్చార్జి ఏ. సుబ్ర మణ్యేశ్వరీ, సీ.ఈ. వో నక్కా అచ్చియ్యనాయుడులు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు సభ్యత్వం ఉన్న ప్రతి రైతు తన ఆధార్ కార్డు జెరాక్స్ తో పాటు నామినీ అధార్ కార్డ్ జెరాక్స్, మొబల్ నెంబరును సంఘ కార్యాలయానికి అందజేయలన్నారు.

అంబేద్కర్ ఆశయాలను కొనసాగించాలి

విశాలాంధ్ర - రావికమతం : విశాఖపట్నం అంబేద్కర్ భవన్ చైర్మన్ బొడ్డు కళ్యాణ్ రావు అన్నారు. రావికమ తం మండలం కేంద్రం లో సాంఘిక సంక్షేమ శాఖ బాలికల వసతి గృహం లో శనివారం విద్యార్థినిలకు, చోడవరం అంబేద్కర్ ట్రస్ట్ ఫౌండర్ అండ్ చైర్మన్ రిటైర్డ్ సివిల్ జడ్జ్ నడుపురి సన్యాసిరావు ఆర్థిక సాయం తో ఏర్పాటు చేసిన పుస్తకాలను ఆయన పంపిణీ చేశారు. విద్యార్థులు బాగా చదువుకొని మంచి అభివృద్ధిలోకి రావాలన్నారు. ఉన్నతమైన స్థానాలాల్లో ఎదగాలన్నారు. అంబేద్కర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని బోధించు, సమీకరించు, పోరాడు అనే నినాదాన్ని తుచా తప్ప కుండా పాటించా లని కోరారు.. ఈ కార్యక్రమంలో అంబేద్క ర్ ట్రస్ట్ నిర్వాహ కులు కండెల్లి వెంకట్రావు, భూపతి రాజు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

భూమి ట్యాంపరింగ్‌పై రెవెన్యూ అధికారులు విచారణ

విశాలాంధ్ర - పాయకరావుపేట : తన భూమిని ట్యాంపరింగ్ చేశారని మండలంలోని శ్రీరాంపురం గ్రామానికి చెందిన అల్లు పెద్ద కృష్ణ జిల్లా కలెక్టర్‌కు స్పందనలో ఇచ్చిన ఫిర్యాదు మేరకు రెవెన్యూ అధికారులు విచారణ నిర్వహించారు. శ్రీరాంపురం రెవెన్యూ, వెంకటనగరం పంచాయతీ పరిధిలో సర్వే నెంబరు 318/10లో 1.01ఎకరా భూమి 1999లో ప్రభుత్వం పంపిణీ చేసిందని, పాసుపుస్తకం కూడా అందించారని, అప్పటి నుండి జీడితోట సాగు చేసుకుంటున్నట్లు కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదులో అల్లు పెద్ద కృష్ణ పేర్కొన్నారు. అయితే తనకు చెందిన భూమి ట్యాంపరింగ్ చేసి వేరొకరు పేరు మార్పు చేసుకున్నారని దీనిపై కోర్టులో కేసు వేసినట్లు తెలిపారు. దీనిపై ఆర్ఐ త్రినాద్, సర్వేయర్ పొడగట్ల సత్యనారాయణ భూమిని పరిశీలించి విచారణ నిర్వహించారు.

గంజాయి, నాటుసారా ఆరోగ్యానికి మంచిది కాదు

విశాలాంధ్ర - మాడుగుల : మండలంలోని ఎం.గదబూరు గ్రామంలో మాడుగుల మండల లీగల్ సర్వీసెస్ ఆథారిటి ఆధ్వర్యంలో శనివారంగంజాయి, నాటుసారా నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సమావేశంలో స్థానిక న్యాయవాది శ్రీనాథు ప్రసాదరావు మాట్లాడుతూ గంజాయి, నాటుసారా ఆరోగ్యానికి మంచిది కాదన్నారు. కావున ప్రజలు ఈ రెండిటికి దూరంగా ఉండాలని చెప్పారు. అలాగే మెడికల్ క్యాంపు కూడా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు, ఎస్సై పి.దామోదర నాయుడు, వైద్యాధికారులు పాల్గొన్నారు.

నల్ల బ్యాడ్జీలతో అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం

జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షురాలు లోచల సుజాత

విశాలాంధ్ర - గొలుగొండ : విజయవాడలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ మహా శిల్ప స్మృతి వనం పై జరిగిన దాడిని ఖండిస్తూ మేజర్ పంచాయతీ ఏఎల్ పురం గ్రామంలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి నల్ల బ్యాడ్జీలతో జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షురాలు ఏ ఎల్ పురం సర్పంచ్ లోచల సుజాత ఆధ్వర్యంలో శనివారం పాలాభిషేకం నిర్వహించారు ఈ సందర్భంగా ఎస్సీ సెల్ అధ్యక్షురాలు లోచన సుజాత ప్రసంగిస్తూ గత వైసిపి ప్రభుత్వం హాయములో అప్పటి ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి భారత రాజ్యాంగ నిర్మాత బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి అయినటువంటి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఖ్యాతిని ప్రపంచానికి నలుమూలల చాటి చెప్పాలనే సదుద్దేశంతో విజయవాడలో నడిబొడ్డున నిర్మించిన అంబేద్కర్ మహా శిల్ప స్మృతి వనం పై దాడి చేయడం అంటే ప్రజాస్వామ్యంపై దాడి చేయడమేనని ఆమె అన్నారు దీనిని హేయమైన చర్యగా భావిస్తూ తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు అలాగే అంబేద్కర్ మహా శిల్ప స్మృతి వనం పై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేసి ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా తగిన చర్యలు రాష్ట్ర ప్రభుత్వం తీసుకోవాలని కూటమిప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సామాజిక వర్గ వైఎస్ఆర్సిపి కార్యకర్తలు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

వైసీపీ నేతలు కొవ్వొత్తుల ప్రదర్శన

విశాలాంధ్ర - యస్. రాయవరం : విజయవాడలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం వద్ద జరిగిన సంఘటనపై వైసీపీ కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించింది. మండలంలో అడ్డరోడ్డు తిమ్మాపురం గ్రామంలో పాయక రావుపేట నియోజకవర్గ వైసిపి ఇన్ చార్జ్ మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ప్రదర్శన చేసి నిరసన తెలియ జేశారు. ఇటువంటి చర్యలకు దిగితే సహించేది లేదని అక్కడ జరిగిన సంఘటనపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్య క్రమంలో ఎంపీపీ కోన లోవలక్ష్మి, జెడ్పిటిసి కాకర దేవి, వైసిపి మండల అధ్యక్షుడు బొలిశెట్టి గోవిందరావు, వైస్ ఎంపీపీ అప్పన్న, వైసీపీ జిల్లా కార్యదర్శి కొణతాల శ్రీనివాసరావు, వైసీపీ నాయకులు మధు వర్మ, సర్పంచులు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

ద్వారబంధం పూజలో సుందరపు

విశాలాంధ్ర - మునగపాక : మునగ పాకలో శనివారం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ద్వారబంధం ఏర్పాటు పూజా కార్య క్రమానికి యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ సోదరుడు, ఉత్తరాంధ్ర జిల్లాల జనసేన పార్టీ అధికార ప్రతినిధి సుందరపు సతీష్ కుమార్ విచ్చేసారు. అక్కడ ఏర్పాటు చేసిన ద్వార బంధనకు పూజ చేశారు. ఆలయ నిర్మాణం వేగంగా పూర్తి కావాలని, ఆ శక్తిని కమిటీ వారికి ఇవ్వాలని ప్రార్థించారు. నిర్వాహకులకు అభి నంద నలు చెప్పారు. సుందరపు సతీష్ కుమార్ కమిటీ సభ్యులు, భక్తులు సాదర స్వాగతం పలికారు.

వైసీపీ హయాంలో ప్రభుత్వ భూములు అన్యక్రాంతం

ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు

విశాలాంధ్ర - బుచ్చయ్యపేట : చోడవరం నియోజవర్గం బుచ్చయ్యపేట మండలం ఎల్ సింగవరం గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో స్థానిక శాసనసభ్యులు కేఎస్ఎన్ఎస్ రాజు మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వంలో డిఫారం భూముల విషయంలో మాజీ శాసనసభ్యులు ధర్మ శ్రీ వైయస్సార్ పార్టీకి చెందిన కొంతమంది నేతలు కలగజేసుకొని కొంతమంది ప్రైవేటు వ్యక్తులకు ప్రభుత్వ భూములను ప్రైవేటు భూములు గా నమ్మించి వారికి చూపించి బయట వ్యక్తులకు అమ్మకాలు జరిపి కోట్లాది రూపాయలు చేతులు మార్చుకున్నారని నేడు అవి ప్రభుత్వ భూములను తెలియడంతో కొనుక్కున్న వ్యక్తులు లబోదిబోమంటున్నారని ఈ కుంభకోణంపై జిల్లా కలెక్టర్కు ఫిర్యాదు చేసి ఒక రెవెన్యూ డివిజన్ అధికారి సమక్షంలో విచారణ జరిపి గ్రామ సభలు నిర్వహించి పేదలకు అన్యాయం జరగకుండా నియోజకవర్గంలో అన్యాక్రాంతంగా చేతులు మారిన భూములన్నింటిని త్వరలోనే స్వాధీనం చేసుకుంటామని దానిలో భాగంగా అప్పటి ఎమ్మెల్యే ధర్మశ్రీ వారి పార్టీ కీ సంబంధించిన నాయకులు అధికారులు కూడా కుమ్మక్కై ప్రభుత్వ భూములలో జోక్యం చేసుకొని కోట్లాది రూపాయలు దండుకున్నారని వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని మరీ ముఖ్యంగా జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన రిసర్వే కారణంగా చాలా గ్రామాలలో తగాదాలు ఏర్పడుతున్నాయని ఈ సర్వే కారణంగా ఎవరి భూములు ఎక్కడ ఉన్నాయో కూడా అర్థం కాని అయోమయ స్థితిలో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు అయితే నిన్న జరిగిన సంఘటనలో ఎల్ సింగవరం గ్రామంలో ప్రభుత్వ భూమిని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన వ్యక్తులు అక్రమంగా కబ్జా చేశారనే కారణంతో స్థానిక సర్పంచి మధు తన అనుచరులు తో కలిసి సంఘటనా స్థలానికి వెళ్లి అడగడంతో సర్పంచ్ మరియు కార్యకర్తల పైన విచక్షణ రహితంగా మారణాయుధాలతో దాడి చేసి హత్యాయత్నం చేయడం జరిగిందని ఇటువంటి దాడులను టిడిపి ప్రభుత్వం ఖండిస్తుందని హత్యాయత్నం చేసిన వారిని గుర్తించి శిక్ష పడే విధంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. భవిష్యత్తులో సంబంధించిన భూములను ప్రభుత్వం తిరిగి స్వాధీనం చేసుకుని గ్రామ సభల నిర్వహించి పేదలకు అన్యాయం జరగకుండా గ్రామంలోని పేద ప్రజలకు గాని కోమలపూడిలో ఉన్నటువంటి కృషి విజ్ఞాన్ కేంద్రం లాంటి ఏదైనా ఇండస్ట్రీ సెజ్ లాంటివి తీసుకొచ్చే విధంగా ఆలోచన చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు మరిసా నాని, ఎంపీటీసీ ఫోరం అధ్యక్షులు దేవర అప్పారావు, మండల పార్టీ అధ్యక్షులు గోకివాడ కోటేశ్వరరావు, కూటమి సీనియర్ నాయకులు డొంకినా అప్పలనాయుడు, తమరాన దాసు, విశాఖ డైరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, దాడి సూరి నాగేశ్వరరావు, పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు పునరాలోచించాలి

విశాలాంధ్ర - రావికమతం : ఎస్సి వర్గీకరణ పై సుప్రీంకోర్టు పునర్ ఆలోచన చేయాలని కోరుతూ రావిక మతం మండలం కొత్త కోటలో డా బి ఆర్ అంబేద్కర్ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో శనివారం నిరసన చేపట్టారు. స్థానిక బియన్ రోడ్డు లో చేపట్టిన నిరసన కార్య క్రమంలో ఆ సంఘం సభ్యులు మల్లేటి రాజు, బి.బుల్లిబాబు, పూడి దేవ, అప్పా రావు, కాగిత గంగరాజు, బి నాగేశ్వరరావు తదితరులు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధం అంటూ గతంలో సుప్రీం కోర్టు ధర్మాసను ఇచ్చిన తీర్పునే కాదని మరో ధర్మాసను వర్గీకరణ చేసుకోవచ్చం టూ చెప్పటం వెనక రాజకీ య ఒత్తుడులు ఉన్నాయన్న అనుమానాలు కలుగు తు న్నాయన్నారు. ఏబిసిడి వర్గీకరణ కారణం గా ఎస్సీ మాలలతో పాటు మరో 16 ఉప కులాలకు తీవ్ర అన్యాయం జరుగుతుంద ని ఆందోళన వ్యక్తం చేశారు. కోర్టు ఇచ్చిన వర్గీకరణ ఆదేశాలను రాష్ట్ర ప్రభుత్వాలు నిలుపు చేయాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగ సవరణతో పాటు ఆర్టికల 341 లో అంశాలను పరిగణలోకి తీసుకోవాల న్నారు. వర్గీకరణ అంశం ముగిసే వరకు తమ నిరసన పోరా టం ఆగదని స్పష్టం చేశారు. అంతకుముం దు గ్రామంలో భారీ స్థాయి మహిళలు చిన్న పిల్లలతో శాంతి ర్యాలీ నిర్వహిం చారు అనంతరం మూడు రోడ్డు కూడలిలో మానవహారంగా ఏర్పడి పలు నినాదాలు చేశారు కార్యక్రమంలో సంఘం నాయకులు పూడి అర్జున్, మరువాడ అర్జునరావు, టి.శేఖర్, పూతి అప్పారావు, బి.చిరంజీవి పలు గ్రామాల అంబేద్కర్ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

పలువురు యువకులు జనసేనలో చేరిక

విశాలాంధ్ర - కే కోటపాడు : మండల కేంద్రం కే.కోటపాడుకు చెందిన పలువురు యువకులు శనివారం జనసేన పార్టీలో చేరారు. మాడుగుల నియోజకవర్గ ఇన్చార్జి రాయపురెడ్డి కృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గోపి నాగేశ్వరరావు, జిజరాజేష్, దొడ్డి మహేష్, వేగి ప్రకాష్, గౌరు నాయుడు తదితరులు పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో అంజిబాబు, త్రినాథ్, అచ్యుతరావు, అప్పలనాయుడు, రాజీ నారాయణమూర్తి, వేగి శివాజీ తదితరులు పాల్గొన్నారు.

వేరువేరు ఘటనలో ఇద్దరు మృతి

విశాలాంధ్ర - నక్కపల్లి : మండలంలో వేరువేరు ఘటనలో ఇద్దరు మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. స్థానిక ఎస్సై సన్నీ బాబు ఇచ్చిన వివరాల మేరకు శనివారం చినదొడ్డిగల్లు గ్రామంలో పాలూరి రామ కోటేశ్వరరావు 28 డెక్కన్ కంపెనీ ప్రైవేటు ఉద్యోగి పని చేస్తున్నారు. తన ఇంటి పై ఉన్న చెట్టు కొమ్మను తొలగిస్తుండగా కరెంటు తీగలు తగిలి కరెంట్ షాక్ కొట్టింది. అతని కుటుంబ సభ్యులు హుటాహుటీన స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకు వెళ్ళగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలాఉండగా యన్ నరసాపురం గ్రామానికి చెందిన దాకారపు రాములు 48 ఎలక్ట్రిషన్‌గా పని చేస్తున్నారు. కొండ వెనకాల పాలెం గ్రామంలో గొర్ల తాతారావు ఇంటి నిర్మాణం కోసం ఎలక్ట్రికల్ పనిచేస్తుండగా కరెంటు షాక్ కొట్టడంతో మృతి చెందారు. తన భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యవసాయ ఉత్పత్తులు - విలువ జోడింపుపై మహిళా రైతులకు శిక్షణ

విశాలాంధ్ర - పాయకరావుపేట : తాండవ వాలి రైతు ఉత్పత్తిదారుల సంఘం కార్యాలయంలో మహిళా రైతులకు వ్యవసాయ ఉత్పత్తులు - విలువ జోడింపు అనే అంశంపై శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం ముఖ్య కార్యనిర్వహణ అధికారి జివివి సత్యనారాయణ మాట్లాడుతూ సంఘంలో చేరిన రైతులు వారు పండించిన పంటలను నేరుగా అమ్ముకోవడానికి విలువ జోడింపు చేయడం వలన అధిక ధర పొందవచ్చని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ద్వారా ప్రధానమంత్రి సూక్ష్మ, చిన్న తరహా ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల ఏర్పాటు, యూనిట్లు ఏర్పాటు చేసుకోవచ్చని తెలిపారు. యూనిట్ స్థాపనకు అయ్యే ఖర్చులో 10శాతం లబ్ధిదారుడు, 55శాతం బ్యాంకు రుణం, 35శాతం రాయితీ ఉంటుందని తెలిపారు. సంఘం ద్వారా ఈ ఏడాది యూనిట్లు ఏర్పాటు చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. దీనికి జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ప్రభాకరరావు ఎగ్జిక్యూటివ్ డైరక్టర్‌గా వ్యవహరిస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని మహిళా రైతులు సద్వినియోగం చేసుకొని మహిళా సాధికార దిశగా ముందడుగు వేయాలని జివివి సత్యనారాయణ కోరారు. ఈకార్యక్రమంలో జివివిపిఆర్ వర్మ, శ్రీసత్యదేవ అగరబత్తి కంపెనీ చైర్మన్ పోలినాటి సూరిబాబు రిసోర్స్ పర్సన్స్‌గా వ్యవహరించారు.

స్థాపితం : 1952
విశాలాంధ్ర
తెలుగు జాతీయ దినపత్రిక
విలేకరులు కావలెను
అనకాపల్లి జిల్లాలో ఈ కింది కేంద్రాల్లో పని చేయుటకు కనీస విద్యార్హత ఇంటర్, ఆపైన చదివి జర్నలిజం పట్ల ఆసక్తి కలిగి తెలుగు భాషలో స్పష్టంగా రాయడం, చదవడం వచ్చి ఉండాలి.
తేది: 18-8-2024వ తేదీన ఉదయం 10 నుంచి 11 గంటల వరకు అనకాపల్లి విశాలాంధ్ర కార్యాలయంలో అర్హత రాత పరీక్ష నిర్వహించబడును. ఆసక్తి ఉన్న వారు 18వ తేది ఉదయం 9.30 గంటల్లోగా వాట్సాప్‌లో గాని నేరుగా గాని తమ పేర్లు నమోదు చేసుకోగలరు. అదేరోజు మధ్యాహ్నం 2 గం.ల నుంచి ఇంటర్వ్యూలు నిర్వహించబడును.
ఖాళీలు: అనకాపల్లి టౌన్, అనకాపల్లి కలెక్టరేట్, చోడవరం రూరల్, రోలుగుంట, బుచ్చయ్యపేట, నర్సీపట్నం రూరల్, నాతవరం, సబ్బవరం కేంద్రాల్లో పని చేయాలి.
సంప్రదించాల్సిన చిరునామా:
కొండలరావు, విశాలాంధ్ర బ్యూరో చీఫ్
విశాలాంధ్ర కార్యాలయం, దుర్గా లాడ్జి వీధి, నర్సింగరావుపేట, రామచంద్ర థియేటర్ వెనుక, అనకాపల్లి.
సెల్: 9291900805. 9573385159.